


# విశ్వాసహీనులు

చెరువుకు గండి పడ్డది. పోలయ్య దూరాన్నుంచే చూశాడు. ఒక్క వురుకులో పరుగెత్తుకుంటూ దాని దగ్గరకు వచ్చేశాడు. అతని కళ్ల ఎదుటే నాలుగు నిలువుల ఎత్తున చెరువుకట్ట చీలిపోవటం కనిపించింది. భూదేవి చీల్చుకుపోయినట్లు అనిపించింది. ఆవేశంలో కఱ్ఱపెట్టి చెరువు కట్టను బాదాడు. తనతో వస్తున్న కుక్క ఊరికే అరుస్తోంది.

తనొక్కడూ ఏమయినా చెయ్యగలడేమోనని ప్రయత్నం చేశాడు. నిలువునా చీలుకుపోతున్న కట్ట గండికడ్డంపడి పొలికేకలు పెట్టాడు. కుక్క కొంతదూరందాకా పోయి అరిచి వచ్చింది.

అక్కడినుంచి మాలపల్లి మూడు ఫర్లాంగుల దూరంలో ఉంది. మాట అందే దూరంగాదు. పోలయ్య నోటిదగ్గర రెండుచేతులూ పెట్టుకుని 'ఓ లయ్యో' అంటూ బిగ్గరగా అరిచాడు. నాలుగు పక్కలనుంచి తన మాట తననే పలకరించింది. కాలు కాలిన పిల్లిలా, కుక్క అతనిచుట్టూ తిరుగుతోంది. ఒక్కొక్కసారి పది అడుగులు వూరివైపు వెళ్ళి అరిచి అరిచి తిరిగి వస్తోంది.

గండి పెద్దదవుతోంది. పోలయ్య శరీరం గండి చీలికలో సరిపోవటంలేదు. నీరు చిమకటం మొదలయింది. ఒక్కసారిగా అతని కుడిచేతి పక్కనుంచి నీటి ప్రవాహం వురకలు వేసింది. పరిస్థితి విషమించిందనుకున్నాడు పోలయ్య. చేతిలో కఱ్ఱ దూరంగా విసిరేశాడు. దాన్ని చూసుకుంటూ కుక్క పరుగెత్తింది. పోలయ్య అదును చూచుకుని పైకిలేచాడు.

గండిలోనుంచి నీటి ప్రవాహం ఎరసైకి వురుకుతున్న నాగుపాములా బుసలు కొట్టుకుంటూ చరచరా పోలయ్య వైపు దుముక్కుంటూ వస్తోంది. పోలయ్యలో విచక్షణాజ్ఞానం నశించింది. ఏం చెయ్యగలడో తోచలేదు. నీటి ప్రవాహంనుండి తప్పించుకోవటమే అతని మొట్టమొదటి కార్యక్రమంగా తోచింది. పిచ్చివాడిలా పరుగెయ్యబోయాడు. నాలుగు నిలువుల ఎత్తున నీరు వక్షపళంగా మీదకురికింది.

వెన్నుమీద బలంగా గుద్దినట్లయింది పోలయ్యకు. చేతిలో కర్రగూడా లేదు. అటూయిటూ చూశాడు. తన కుక్క కర్రలాక్కుని తనవైపే వస్తోంది. ప్రాణం లేచివచ్చినట్లయింది. కర్ర అందుకున్నాడు. కుక్క బొంయిమంది. నీటి ప్రవాహం యిద్దరినీ కొట్టేసింది.

కుక్క సంగతి తను చూడనే లేకపోతున్నాడు. తనెళ్లి ఒక తాటిచెట్టుకు కొట్టుకున్నాడు. ఆలస్యం చెయ్యకుండా వెంటనే బోదెను వాటేసుకున్నాడు. నీటి ప్రవాహం తననీ, చెట్టునూ బలంగా అదిమిపెడుతూ పోతోంది. తనచేతిలో కర్ర పట్టు తప్పిపోయింది. దానివంకనే చూస్తున్నాడు. అది కాస్తా పోయి ఎదురుగా దగ్గరలో వున్న తుమ్మచెట్టులో యిరుక్కుపోయింది. తను ఏమాత్రం తాటిచెట్టును పట్టు వదిలినా కర్రమాదిరిగా తనూ తుమ్మచెట్టు వైపుకుపోయి దానికి ఢీకొట్టుకోవలసి వస్తుంది. ఆ వేగానికి తల పగిలిపోవలసి వస్తుంది. పిచ్చివాడిలా కేకలు వేస్తున్నాడు. నీళ్లు తన మెడ ఎత్తున పొంగుకు వస్తున్నాయి.

పట్టు వదలకుండానే పెద్ద పెద్ద కేకలు వేస్తూ నాలుగుపక్కలా కలయచూశాడు. తనవైపుకే మునుగుతూ తేలుతూ వస్తున్న నల్లటి ఆకారాన్ని తన కుక్కగా ఒక క్షణంలో గుర్తించగలిగాడు. అది తనవైపే కొట్టుకువస్తోంది. పోలయ్యకి ఆశ జనించింది, తనతోపాటు వచ్చిన జీవిని కలుసుకోగలిగాను గదా అని. అతను ఏమాత్రం పట్టువదిలినా ఆ వేగానికి తుమ్మచెట్టుకుపోయి కొట్టుకోవలసిందే! ప్రాణాలన్నీ బిగపట్టుకొని వస్తున్న కుక్కవైపు చూశాడు.

కుక్క మునుగుతోంది, తేలుతోంది. జంతువులకి చాలావరకు సహజంగా ఈదటం వచ్చినా, ఈ ప్రవాహవేగానికి తట్టుకోలేకపోతోంది కుక్క. అది మునిగినప్పుడల్లా భగవంతుడిని స్మరించుకొంటూ తాటిబోదెను గట్టిగా కరిచి పట్టుకొంటున్నాడు పోలయ్య. కుక్క మళ్లీ నీటిపైకి రాగానే అతనిలో ఏదో ఆశ చిగిర్చి శోభిస్తోంది. అది వచ్చే రేఖ చూస్తే తనకు అది దగ్గరగానే కొట్టుకుని పోవలసి వస్తుంది. తనలోని చైతన్యాన్నంతటినీ కూడగట్టుకుని అతి శ్రద్ధగా అవలోకిస్తున్నాడు.

అతను ఆలోచించే సమయంలో కుక్క రానే వచ్చింది. పోలయ్యకు తాటిచెట్టును పట్టు విడవటానికి ప్రాణం ఒప్పలేదు. పట్టు సడలినట్లయితే జరగబోయే పరిణామాన్ని అతను బాగానే వూహించుకున్నాడు. ఒక చేతితో గట్టిగా చెట్టును వాటేసుకుని కుడిచేత్తో కుక్కను పట్టుకోబోయాడు. కుక్క తనను గుర్తుపట్టింది. పెద్దగా మొరుగుతూ తన వైపు రావటానికి విశ్వప్రయత్నం చేసింది. విధి దాన్ని పక్కకు నెట్టుకుపోతోంది. తుది ప్రయత్నంగా రెండు కాళ్ళతో చెట్టును పట్టుకుని కుక్క మీదికి రెండు చేతులతోనూ వురికాడు. అప్పటికే కుక్క శరీరం అతని చేతులు దాటిపోయింది. దానితోక మాత్రం చేతికి చిక్కింది. గట్టిగా పట్టుకుని తనవైపు గుంజుకోవటానికి ప్రయత్నం చేశాడు. తోక నలిగిపోయి ప్రవాహంలో పడిపోలేక, ఎదురు ఈదలేక కుక్క పెద్దపెట్టున ఏడుస్తోంది. పోలయ్య ఆ బాధ చూడలేక విడిచిన కన్నీరు నీటిప్రవాహంలో కలిసిపోయింది.

కుక్కను రక్షించలేకపోయినా తన ప్రాణానికి ముప్పు రాకుండా వుండాలనిపించింది. తోక వదిలేశాడు. కుక్కకి స్వేచ్ఛ లభించింది. ప్రవాహంతో కొట్టుకుపోయి తుమ్మచెట్టుకు కొట్టుకుంది.

పోలయ్య తెగించి పోరాడుతున్నాడు. తిరిగి తన చేతులు చెట్టును పట్టుకోలేక పోతున్నాయి. ప్రవాహం తన్ను తోసేస్తోంది. కాళ్లు బలంగా చెట్టును పట్టుకునే వున్నాయి. కాళ్ళన్నీ బాగా గీరుకుపోయినాయి విపరీతంగా మంటలు పుడుతున్నాయి.

కట్ట కలుగులో వుండేది కాబోలు, ఒక త్రాచు కొట్టుకువచ్చింది. తనను చూచే బుసలు కొట్టుకుంటోంది. తాటిచెట్టుకు వచ్చి కొట్టుకోగానే గట్టిగా పట్టుకుంది. తలనుంచి పది అంగుళాల మేర వరకు తాటి బోదెను పట్టుకున్నా తోక భాగమంతా ప్రవాహవేగానికి నీటిపైన తుమ్మచెట్టు వైపుకు బలంగా గుంజబడుతోంది.

పోలయ్యకు దాన్ని చూచేటప్పటికి ప్రాణం లేచివచ్చినట్లయింది. పాముతోకను గట్టిగా పట్టుకుని చెట్టువైపుకు తన చేతులు చేర్చే గట్టి ప్రయత్నం చేశాడు. తనవలన ఒక ప్రాణి రక్షించబడితే పుణ్యం అనుకుందేమో నాగుపాము వులకలేదు, బుస కొట్టలేదు, తోక కదిలించలేదు. పోలయ్యకు తాటిచెట్టు చిక్కింది. గట్టిగా పట్టుకున్నాడు తను పట్టుకున్నది తాచుతోక అని ముందుగా తెలిసేవున్నా, దాని గురించిన భయం నీటిభయంనుంచి తప్పించుకున్న తర్వాతగాని తెలియలేదు. తోక వదిలాడు. అప్పటిదాకా మొండిగా పట్టుకున్న త్రాచు కాస్తా చరచరా పైకి సాగబోయింది. ఇదే అదననుకొని తాచును తోక పట్టుకొని ఒక్క గుంజు గుంజి పక్కకు తప్పుకున్నాడు అది కాస్తా పట్టు తప్పి నీటిలోపడి తుమ్మచెట్టు వైపుకు కొట్టుకుపోయింది.

పోలయ్య 'అమ్మయ్య' అనుకొని యిష్టదైవతాన్ని స్మరించుకుంటున్నాడు. అంతలోనే తన వునికి కదిలిపోతున్నట్లు తోచింది. తల పైకెత్తి చూశాడు. తాటిఆకుగాని, ముచ్చుగాని లేదు. బోడితల ఎండిపోయి కనబడింది. కిందనుంచి కదిలిపోయింది చెట్టు. విరిగి దభాలుమని పడిపోయింది. అప్పటికిగాని పోలయ్యకు గుర్తుకు రాలేదు, తనెక్కిన చెట్టు 'జరిగిన రాత్రి తనే సగందాకా మొదలు నరికిన చెట్ట'ని.

పోలయ్య వెళ్ళి తుమ్మచెట్టుకు కొట్టుకొన్నాడు. తలమీద బలమైన గాయం తగిలింది. స్పృహ వున్నదో లేదో అతనికి తెలియటం లేదు. అంతా మగతగావుంది. కళ్లు బలవంతాన తెరిచి చూశాడు. పక్కనే కొమ్మలో యిరుక్కు పోయిన కుక్క తన చేతికర్రను నోట కరుచుకోని అరవలేక మూలుగుతోంది. తన అంత్య దశలో తనతోటి ప్రాణి ఒకటి వుందికదా అని పోలయ్యకు గుండెలమీద నుంచి ఏదో పెద్ద బరువు తీసివేసినట్లయింది. కళ్లు బలవంతాన మూసుకు పోబోతుండగా చిటారుకొమ్మలో చిక్కుకుపోయి తనవంక జాలిగా చూస్తున్న నాగుపాము కనపడింది. నమ్మిన వూరిని నీటిలో ముంచిన చెరువుకూ, తనకూ భేదం ఏముందా అనే ఆలోచన అతనికి ఆఖరిసారిగా తట్టింది. కళ్లు మూసుకుపోయినాయి.

**(తెలుగు స్వాతంత్ర్య- 30 నవంబర్, 1956)**